సాక్షి బాపట్ల

సోమవారం । 12 । ఆగస్టు । 2024



రేణుక ఎల్లమ్మకు బోనాలు

గురజాల : శ్రావణ మాసం ఆదివారం సందర్భంగా ఒడియ రాజుల కుల దేవత మహంకాళీ వంశీయులు రేణుక ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు.



నాగేంద్రస్వామికి పూజలు

మంగళగిరి: నవులూరు పుట్టతోటలో ఉన్న నాగేంద్రస్వామి పుట్ట వద్దకు శ్రావణమాసం సందర్భంగా ఆదివారం భక్తులు పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

'ప్రసన్నవదనం' ధ్యాయేత్



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులోని బగళాముఖి బండ్లమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారు ప్రసన్న వదనం అలంకారంలో దర్శనమిచ్చారు. బాపట్ల రూరల్ సీఐ హజరత్ బాబుతోపాటు భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

సర్వే పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జేసీ



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన రెవెన్యూ ఉద్యోగుల 12వ బ్యాచ్ సర్వే (థియరీ, ప్లాటింగ్) రాష్ట్రస్థాయి పరీక్షలను ఆదివారం గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ్ పరిశీలించారు. పరీక్ష నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సర్వే ట్రైనింగ్ అకాడమీ (సామర్లకోట) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు చెందిన రెవెన్యూ శాఖ జూనియర్ సహాయకులు, వీఆర్‌ఓ గ్రేడ్–1, సహాయ సెక్షన్ అధికారులకు గతంలో 42 రోజులపాటు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి పరీక్ష నిర్వహించగా అన్ని జిల్లాల నుంచి 1093మందికిగాను 943 మంది రెవెన్యూ ఉద్యోగులు సర్వే ఎగ్జామ్‌కు హాజరయ్యారు. పరీక్షలలో 86 శాతం హాజరు నమోదయ్యింది. పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ సర్వే ట్రైనింగ్ అకాడమీ జాయింట్ డైరెక్టర్/ ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ఎన్ కుమార్ పర్యవేక్షణలో ఈ పరీక్ష నిర్వహించారు. పరీక్షలకు గుంటూరు జిల్లా మైనార్టీ ఆఫీసర్ షేక్ మహబూబ్ షరీఫ్, పరిశీలకులుగా వ్యవహరించారు. గుంటూరు జిల్లా సహాయ సంచాలకులు వై నాగశేఖర్, ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్ ఎంవీ రంగ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ నాగేశ్వరరావు పరీక్షల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాపట్ల వాసికి స్విమ్మింగ్‌లో కాంస్య పతకం



బాపట్ల: బాపట్ల వాసి సీహెచ్ అవిజ్ఞకు జూనియర్ నేషనల్ స్విమ్మింగ్ పోటీల్లో కాంస్య పతకం లభించిందని రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.మోహన్‌వెంకటరామ్ తెలిపారు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఈనెల 6నుంచి 11వ తేదీ వరకు జరిగిన పోటీల్లో 100మీటర్ల విభాగంలో కాంస్య పతకం సాధించారు. అవిజ్ఞ కాంస్య పతకం సాధించటంతో బాపట్ల జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాకేశ్‌వర్మ, నాగమురళి, ట్రెజరర్ పి.రామరాజు అభినందనలు తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 5527 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 292 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1539 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 693 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 260 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 400 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 2040 క్యూసెక్కులు విడుదల చేశారు.

నేటి నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, క్లాప్‌మిత్రలకు ఈ నెల 12, 13, 14వ తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నారు. గుంటూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో కార్యక్రమం ఉంటుంది. ఈ మేరకు జెడ్పీ సీఈవో ఎన్‌ఎస్‌వీబీ వసంత రాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25కు పునరుద్ధరించబడిన రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళికను ఆమోదించిన నేపథ్యంలో ఈ శిక్షణకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ ఆదేశించారని పేర్కొన్నారు. గ్రామ స్వరాజ్యపు కల సాకారానికి పలు అంశాలపై గ్రామస్థాయి కేంద్రీకృత ఆచరణాత్మక శిక్షణ ఇస్తామని వెల్లడించారు. పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణతో ఆదాయం పెంపు, పంచాయతీ విధులు, బాధ్యతలు, అభివృద్ధి ప్రణాళికలు, వంద రోజుల యాక్షన్ ప్లాన్, పీఆర్ వన్ యాప్, విద్యుత్ పొదుపు వంటి అంశాలపై శిక్షణ పొందిన రీసోర్స్ పర్సన్‌లు వారికి వివరించనున్నారని చెప్పారు. ఎంపీడీవోలు, ఈవో పీఆర్డీల పర్యవేక్షణలో కార్యక్రమం ఉంటుందని వివరించారు.

బతుకు దివ్యోత్సవం

- విధిని గెలిచిన యోధులు
- సంకల్పం ముందు తలవంచిన వైకల్యం
- స్వశక్తితో దివ్యాంగుల ముందడుగు

వెక్కిరిస్తున్న వైకల్యాన్ని అధిగమిస్తూ.. శక్తినంతటినీ కూడదీసుకుని అకుంఠిత దీక్షతో ముందుకు సాగుతున్నారు.. విధిని గెలిచి విజయదుందుభి మోగిస్తున్నారు. బరువుబాధ్యతలను భుజాలపై మోస్తూ నిత్య జీవనాన్ని దివ్యోత్సవంగా మలుచుకుంటున్నారు. వైకల్యం.. కలల సాఫల్యానికి అడ్డు కాదని, దివ్యాంగులమైనా బతుకు పోరులో యోధులమని నిరూపిస్తున్నారు. స్వశక్తితో జీవిస్తూ.. పలువురికి ఆసరాగా.. ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్న కొందరు విభిన్న ప్రతిభావంతుల జీవితాల్లోకి ఓసారి తొంగిచూద్దాం పదండి.. అవయవాలన్నీ సవ్యంగా ఉన్నా.. జీవితాన్ని నెట్టుకొచ్చేందుకు ఇబ్బంది పడే ఎందరికో వీరు మార్గదర్శకులు. – యద్దనపూడి

'చెప్పు'కోదగిన విజయం



ఈయన పేరు పల్లెపోగు దానియేలు పుట్టుకతోనే రెండు కాళ్లు చచ్చుపడ్డాయి. పెరిగి పెద్దయ్యే కొద్దీ నలుగురిలా ఎందుకు నడవలేక పోతున్నానని మానసికంగా కుంగిపోయేవారు. 25 ఏళ్ల వయసులో పెళ్లైంది. నమ్మి వచ్చిన భార్యకు ఏ లోటూ రాకూడదనే ఉద్దేశంతో చెప్పులు కుట్టే పని మొదలుపెట్టారు. స్వగ్రామం గన్నవరం పక్కన ఉన్న పూనూరులో కొంత జాగాలో చెప్పులు కుడుతూ వచ్చే ఆదాయంతో హాయిగా జీవిస్తున్నారు. ఇద్దరి ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేశారు. ఇది చెప్పుకోదగిన విజయమే కదా..!

జీవితం 'రంగుల'మయం



ఈయన పేరు తిప్పాబత్తిన రాజారావు. ఊరు పూనూరు. చిన్నప్పుడే పోలియోతో ఒక కాలు చచ్చుబడింది. తల్లిదండ్రుల ప్రోద్బలంతో డిగ్రీ వరకు చదువుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్నతవిద్యాభ్యాసం సాధ్యం కాలేదు. కాలు లేకున్నా.. అందరితో సమానంగా బతకాలనే పట్టుదలతో జీవితాన్ని రంగులమయం చేసుకోవాలని కలలు కన్నారు. పెయింటింగ్ పని నేర్చుకొన్నారు. కుటుంబాన్ని పోషించడంతోపాటు మరో 8 మందికి జీవనోపాధి చూపిస్తున్నారు.

సమోసా అంగడితో సగర్వంగా..



ఈమె పేరు కుంభా వెంకాయమ్మ. చిన్నప్పుడే పోలియో సోకి ఒక కాలు చచ్చుపడిపోయింది. పర్చూరు గ్రామం. సమోసా అంగడే ఆమెకు జీవనోపాధిగా మారింది. కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్దేశంతో సొంతంగా సమోసాలు తయారుచేసుకుంటూ రెండుమూడు షాపులకు సరఫరా చేస్తున్నారు. గ్రామంలోనూ విక్రయిస్తున్నారు. రోజుకు రూ.500 నుంచి రూ.700 వరకు సంపాదిస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

జ్యూస్ షాప్‌తో జాలీగా..



ఈయన పేరు బొల్లిమేర దేవసహాయం. ఊరు చినగంజాం. పుట్టుకతోనే పోలియో మహమ్మారితో రెండు కాళ్లు చచ్చుబడ్డాయి. 10వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. కుటుంబ పోషణార్థం గ్రామంలో మొదట బిర్యానీ పాయింట్ పెట్టారు. ఆశాజనకంగా సాగకపోవటంతో ఐదేళ్ల క్రితం జ్యూస్ పాయింట్ పెట్టారు. బాగా సాగుతోంది. స్వశక్తితో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

సోడాతో శోభాయమానం



యద్దనపూడి మండలం జాగర్లమూడి గ్రామానికి చెందిన షేక్ మహబు సుభాని పుట్టుకతోనే బధిరుడు (మూగ, చెవుడు). పెళ్లైంది. తన కుటుంబం సమాజంలో గౌరవంగా బతకాలనే సంకల్పంతో 30 ఏళ్లుగా గ్రామంలో సోడా బండితో జీవితాన్ని సాగిస్తున్నారు. బతుకును శోభాయమానం చేసుకుంటున్నారు. సుభానికి ఇద్దరు పిల్లలు. కూతురిని డిగ్రీ వరకు చదివించి ఇటీవలే పెళ్లి చేశారు. బాబు ఇంజినీరింగ్ పూర్తిచేశాడు.

క్రమ'శిక్షణతో అల్లుకున్న' జీవితం



ఈమె పేరు పోపూరి వసుంధరాదేవి. చిన్నప్పుడే పోలియోతో రెండు కాళ్లు చచ్చుపడ్డాయి. 15ఏళ్ల వయసులో అల్లికలు, టైలరింగ్ నేర్చుకున్నారు. యడ్లపాడు పాలిటెక్నిక్ కాలేజీ తరపున 100 మందికి, ఒంగోలు జన శిక్షణ సంస్థ తరపున మరో 150 మందికి కుట్లు, అల్లికలు, టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం సమగ్రశిక్ష అభియాన్ ద్వారా ద్రోణాదుల పాఠశాలలో ఇన్‌స్ట్రక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

వరద తగ్గుముఖం



కొల్లూరు : ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజ్‌కు వస్తున్న వరద నీరు తగ్గుముఖం పట్టడంతో దిగువకు సముద్రంలోకి విడుదల చేసే నీటి పరిమాణాన్ని అధికారులు క్రమేపీ తగ్గించుకుంటూ వస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి ఆదివారం ఉదయం 3.08 లక్షల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. సాయంత్రానికి 2.71 లక్షల క్యూసెక్కులకు నీటి విడుదలను తగ్గించారు. దీంతో నదీ పరీవాహక గ్రామాలకు ప్రస్తుతానికి ముంపు ముప్పు తప్పినట్టే. సోమవారానికి నదిలో వరద ఉధృతి మరింత తగ్గే అవకాశం ఉంది. కొన్నిచోట్ల పల్లపు భూముల్లోకి నీరు చేరింది. అక్కడక్కడ మిరప, బంతి, అరటి, పశుగ్రాసం తోటలు ముంపు బారిన పడ్డాయి. దోనేపూడి కరకట్ట దిగువన చినరేవుపై ఉన్న లోలెవల్ వంతెనపై నీరు ప్రవహిస్తోంది. నీటిలోనే స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. వీరిని అధికారులు నియంత్రిస్తున్నారు. పెసర్లంక అరవింద వారధి ఎగువన కృష్ణా నది నిండుగా పరవళ్లు తొక్కుతోంది. ఇదిలా ఉంటే కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్ గేట్ కొట్టుకుపోవడంతో అక్కడి నుంచి వచ్చే నీటితో మళ్లీ వరద ముప్పు పొంచి ఉందని బాపట్ల జిల్లా రైతాంగం ఆందోళన చెందుతోంది.

23న దుర్గగుడిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 23వ తేదీ సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆచరించడానికి దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. ఆ రోజు ఉదయం 7 గంటలకు ఆర్జిత సేవగా సామూహిక వరలక్ష్మీ వ్రతం, అనంతరం ఉదయం 10 గంటల నుంచి ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించాలని దేవస్థాన వైదిక కమిటీ నిర్ణయించింది.



ఆనంద పరవళ్లు: కృష్ణవేణి ఘాట్ వద్ద జలాశయంలో పర్యాటకులు

జన హోరై నినదించే

నాగార్జున సాగర్ జల, జన కళతో సందడిగా మారింది. రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు దుముకుతున్న నదీమతల్లిని తిలకించేందుకు వచ్చిన పర్యాటకులతో జనసంద్రంగా మారింది. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతోపాటు సుదూర ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులూ నడపడంతో తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు పోటెత్తారు. ఫలితంగా సాగర్‌డ్యాం దిగువన కృష్ణాతీరం కిటకిటలాడింది. జలాశయంలో పర్యాటకులు ఈదుతూ కేరింతలు కొట్టారు. రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. హోటళ్లు, అతిథి గృహాలూ రద్దీగా కనిపించాయి. హోటళ్లలో భోజన పదార్థాలు సరఫరా చేయలేక నిర్వాహకులు చేతులెత్తేశారు. షాపుల్లో వాటర్‌బాటిళ్లు దొరకని పరిస్థితి నెలకొంది. ప్రముఖ సినీ నటి లయ కాసేపు సాగర్ వద్ద సందడి చేశారు. ఆమెను చూసేందుకు పర్యాటకులు ఆసక్తి చూపారు. – విజయపురిసౌత్



లాహిరి..లాహిరి..లాంచీలో..: లాంచీలో నాగార్జున కొండకు ప్రయాణం



'కళ'యా'.. నిజమా: సాగర్ రేడియల్ క్రస్ట్‌గేట్ల వద్ద సినీనటి లయ సందడి

'పాలమారుతోంది'

- అటు వరద.. ఇటు వ్యథ
- నారుమళ్లకు నీటి ఎద్దడి
- ట్యాంకర్లతో తడులు అందిస్తున్న రైతులు
- 8,800 ఎకరాల ఆయకట్టుకు అందని నీరు
- 8 గ్రామాల్లో అన్నదాతల కష్టాలు

రెంటచింతల: చెంతనే ఉన్న సాగర్‌కు ఓ వైపు వరద పోటెత్తుతున్నా.. మండల పరిధిలోని మల్లవరం మేజర్ కాల్వ ఆయకట్టులోని రైతులు నీటి కోసం అర్రులు చాస్తున్నారు. నాలుగు రోజులుగా కాలువకు నీరు నిలుపుదల చేయడంతో రైతులు అల్లాడిపోతున్నారు. మాచర్ల రూరల్, కంభంపాడు, గన్నవరం, అమ్మజమ్మలమడక, తుమృకోట, పశర్లపాడు, జెట్టిపాలెం, మల్లవరం గ్రామాల్లో సుమారు 8,800 ఎకరాల ఆయకట్టు ఈ మేజర్ కాలువ కింద ఉంది. ఇందులో సుమారు 3,572 ఎకరాల్లో వరి సాగుచేస్తున్నారు. ఆయకట్టుకు నాలుగురోజులుగా నీరు రాకపోవడంతో వరి నారుమళ్లు ఎండిపోయి.. నెర్రలిస్తున్నాయి. వీటిని కాపాడుకునేందుకు ట్యాంకర్లతో రైతులు నీరు పెడుతున్నారు. ఈ ప్రాంతంలో సాగు చేస్తున్న పత్తి పంట కూడా నీటి ఎద్దడితో బెట్టకు వచ్చే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మిర్చి మొక్కలను నాటుకోవడానికి ఇంటివద్ద నుంచి బండ్లపై డ్రమ్ములలో నీరు తెచ్చుకుంటున్నట్లు పలువురు కర్షకులు చెప్పారు.

నీటిని కొని..

తుమృకోట గ్రామంలో రైతులు ఎకరం నారుమడిని తడిపేందుకు ఐదు వేల లీటర్ల ట్యాంకర్ నీరు రూ.1,500 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. నారుమళ్లను కాపాడుకోవడానికి రూ.3వేల నుంచి రూ.4,500 వరకు ఖర్చు పెట్టినట్లు జంగాల సైదారావు అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇరిగేషన్ జేఈ బి.హిమబిందును వివరణ కోరగా ముందు తాగునీరు విడుదల చేశామని, అనంతరం 6వ కి.మీ. వద్ద మల్లవరం మేజర్‌కు గండిపడటంతో నాలుగు రోజుల కిందట సాగు నీటిని నిలుపుదల చేశామని పేర్కొన్నారు. మరమ్మతులు చేపట్టామని, అయినా ప్రస్తుతం మెయిన్ కెనాల్ (కంభంపాడు పెద్దకాలువ)కు మూడు అడుగుల నీరు మాత్రమే వస్తుందని, నీటిమట్టం ఐదు అడుగులకు చేరినప్పుడే మల్లవరం మేజర్‌కు సాగునీరు వచ్చే అవకాశం ఉందని వివరించారు.



నెర్రలిచ్చి ఎండిపోతున్న వరి నారుమడి



ట్యాంకర్‌తో నారుమడికి నీరుపెడుతున్న తుమృకోట రైతు

బెంగాలీ నాట్లు భళీ

- రైతులకు తగ్గుతున్న భారం
- తక్కువ నారుతోనే నాట్లు
- విత్తన వినియోగం తగ్గుదల
- వరి సాగులో పెట్టుబడి ఆదా
- 400 హెక్టార్లలో బెంగాలీలతోనే నాట్లు

పిట్టలవానిపాలెం: తక్కువ నారుతో తక్కువ సమయంలో తక్కువ మందితో వేగంగా నాట్లు వేయడం బెంగాలీ కూలీల ప్రత్యేకత. దీనివల్ల నారుమడికి విత్తనాల వినియోగం, పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి. ఫలితంగా బాపట్ల జిల్లా రైతులు బెంగాలీ కూలీలతో నాట్లు వేయించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వ్యవసాయ శాఖ కూడా బెంగాల్ తరహాలో నాట్లు వేస్తే తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుందని చెబుతోంది. దీంతో రైతులు బెంగాలీ కూలీలను తీసుకొస్తున్నారు. ఇప్పటికే జట్లుగా వచ్చిన బెంగాలీలు పలు గ్రామాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని కాంట్రాక్టు ప్రాతిపదికన రైతులతో మాట్లాడుకుంటున్నారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం లోపు నాట్లు పూర్తిచేయడం బెంగాలీల అలవాటు. ఇప్పటివరకు జిల్లాలో 400 హెక్టార్లలో బెంగాలీ కూలీలతోనే నాట్లు వేయించడం గమనార్హం.



నాటు వేస్తున్న బెంగాలీ కూలీలు

లేత నారుతోనూ నాట్లు

స్థానిక రైతులు గతంలో ఎకరానికి 25 కిలోల విత్తనాలు నారు కోసం వినియోగించేవారు. బెంగాలీ కూలీల రాకతో ఎకరానికి 15 నుంచి 20 కిలోలు విత్తనాలు మాత్రమే వినియోగిస్తున్నారు. స్థానిక కూలీలు 30 రోజుల వయస్సు గల నారుతో నాట్లు వేస్తే.. బెంగాలీలు 15 నుంచి 20 రోజుల వయస్సు ఉన్న లేత నారుతోనూ నాట్లు వేయగలరు. వీరు వేసిన నాట్లు నాలుగైదు రోజుల్లో మూనలు తిరుగుతాయి. స్థానిక కూలీలు వేసిన నాట్లు మూనలు తిరగాలంటే పది రోజులు పడుతుంది. నాట్లకు స్థానిక కూలీలు ఆరుగురు అవసరమైతే బెంగాలీలు నలుగురు సరిపోతారు. వీరు ఎకరానికి 10 నుంచి 15 పోగులు వాడితే స్థానిక కూలీలు 45 పోగులకుపైగా వినియోగిస్తారు. మొత్తంగా స్థానిక కూలీలతో పోలిస్తే బెంగాలీ నాట్ల వల్ల రైతులకు ఖర్చులు చాలా వరకు కలిసివస్తాయి. అంతేకాదు దిగుబడులూ అధికంగా వస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

దిగుబడి పెరిగింది



సొంతభూమితోపాటు కౌలు వ్యవసాయం ఐదు ఎకరాలను సాగు చేస్తున్నా. రెండేళ్లుగా బెంగాలీ కూలీలతో నాట్లు వేయిస్తున్నాను. వారు నేర్పుగా నాట్లు వేస్తారు. ఫలితంగా ఖర్చు తగ్గింది. చీడపీడల బెడద తగ్గింది. ఎకరానికి ఐదు బస్తాల దిగుబడి పెరిగింది.

– జనార్దన్, రైతు


మూడొంతులు ఖర్చు తక్కువ



వ్యవసాయం ఈ ఏడాది నుంచే చేస్తున్నా. బెంగాలీలతో నాట్లు వేయిస్తున్నా. నాటు విధానం చాలా బాగుంది. సాధారణ విధానంలో వరి నాటుకు ఎకరానికి 5 సెంట్లకుపైగా వరినారు వినియోగించేవారు. బెంగాలీ విధానంలో ఒక సెంటు నారుతో సరిపోతుంది. ఖర్చు విషయంలో ఆదిలోనే మూడొంతులకుపైగా తగ్గిపోయింది.

– అత్తింటి సుందర్ సింగ్, రైతు

80శాతం బెంగాలీల నాట్లే



పిట్టలవానిపాలెం మండలంలో 12,500 ఎకరాలలో సాగు విస్తీర్ణం ఉంది. గతేడాది 50 శాతం వరకు బెంగాలీ కూలీలతో నాట్లు వేయించారు. ఈఏడాది 80 శాతం వారితోనే వేయిస్తున్నారు. బెంగాలీ నాట్ల వల్ల సాగు ఖర్చులు తగ్గడంతోపాటు పురుగు మందుల వాడకమూ తగ్గుతుంది. అందువల్ల ఎక్కువ మంది రైతులు బెంగాలీల వైపు మొగ్గు చూపుతున్నారు.

– సుదర్శనరావు, ఏఈఓ, పిట్టలవానిపాలెం

క్లుప్తంగా

విశ్రాంత ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణశాస్త్రి మృతి



చినగంజాం (పర్చూరు): విశ్రాంత ఉపాధ్యాయుడు మల్లాది లక్ష్మీనారాయణ శాస్త్రి (101) మృతి చెందారు. నెల్లూరులోని తమ్ముడి కుమారుడి ఇంట్లో అనారోగ్యంతో శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక వైఆర్ హైస్కూల్లో ఆయన సుమారు 35 సంవత్సరాల పాటు గణితం ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఎంఎల్ఎస్ మాస్టారుగా ఈ ప్రాంతంలో సుపరిచితులు. ఈయన దగ్గర చదువుకున్న అనేక మంది వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. వారిలో టెలికాం మాజీ జీఎం యశోద ప్రసాద్, ప్రముఖ చిత్రకారుడు లంకా ప్రసాద్, కొల్లా సుబ్బారావు, నారాయణశాస్త్రి, పి.వి.ఎస్. ప్రసాద్ కె. రామకోటేశ్వరరావు, పాటోలు ఉదయ్ భాస్కర్, రాంబాబు, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

నేడు జేఎన్వీలో ప్రాంతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

చిలకలూరిపేటటౌన్: మండలంలోని మద్దిరాల పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రాంతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు తెలిపారు. జవహర్ నవోదయ విద్యాసమితి ఆధ్వర్యంలో జేఎన్వీ విద్యాలయాల విద్యార్థులకు మాత్రమే ఈ పోటీలు ఉంటాయన్నారు. సోమ, మంగళవారాల్లో ఉదయం 10.30 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. తొలిరోజు పోటీలను పల్నాడుజిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. మరో అతిథిగా ధనలక్ష్మి గ్రూప్ డైరెక్టర్ పి.వీరనారాయణ హాజరవుతారన్నారు. రెండోరోజైన మంగళవారం సాయంత్రం ముగింపు సభా కార్యక్రమంలో చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హాజరు కానున్నట్లు వెల్లడించారు. మరోఅతిథిగా పల్నాడు జిల్లా యూబీఐ రీజినల్ హెడ్ టి.మాధురి పాల్గొంటారన్నారు. ముగింపు సభలో విజేతల వివరాలు వెల్లడించి, అనంతరం బహుమతులు అందజేస్తారని వివరించారు.

ముస్లింలంటే అంత చులకనా ?



ఈపురుపాలెం బాలుర హైస్కూల్ నుంచి ర్యాలీ చేస్తున్న ముస్లింలు



బాపట్ల ప్రధాన రహదారిపై బైఠాయించి నినాదాలు చేస్తున్న ముస్లింలు

- పోలీసులు, ప్రభుత్వ తీరుపై ముస్లింలు, ఆరీఫ్ కుటుంబ సభ్యులు ఆగ్రహం
- ఈపురుపాలెం–బాపట్ల ప్రధాన రహదారిపై బైఠాయింపు
- ఆరీఫ్ హత్య కేసులో నిందితులను త్వరగా అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి

చీరాల టౌన్: కారుకు సైడ్ ఇవ్వలేదన్న కారణంగా ముస్లిం యువకుడిని దారుణంగా హత్య చేసి వారం రోజులు కావస్తున్నా నిందితుల్ని పోలీసులు ఇంకా పట్టుకోకపోవడం దారుణమని మృతుని బంధువులు, ముస్లిం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాపట్ల జిల్లా చీరాలలో ఆదివారం దారుణ హత్యకు గురైన ఆరీఫ్ (18) స్వగ్రామమైన ఈపురుపాలెంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాల నుంచి అధిక సంఖ్యలో ఫ్లెక్సీలతో ఆరీఫ్ కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితుల్ని త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం గ్రామంలోని మార్కెట్ సెంటర్లో ఈపురుపాలెం–బాపట్ల ప్రధాన రహదారిపై బైఠాయించి పెద్దఎత్తున ప్రభుత్వ తీరు నిరసిస్తూ నినాదాలు చేశారు.

పోలీసులు ఏం చేస్తున్నారు ?

ఈ సందర్భంగా పలువురు ముస్లిం సంఘాల నాయకులు, మృతుని బంధువులు మాట్లాడుతూ ఈపురుపాలెంలో సంచలనం రేపిన యువతి హత్యాచారం కేసులో నిందితుల్ని 36 గంటల్లోనే పట్టుకుని జైలుకు పంపిన పోలీసులు, పేద ముస్లిం యువకుడిని అకారణంగా హత్య చేసిన నిందితులను ఎందుకు పట్టుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. ఫొటోలు, వివరాలు, అందించినా ఎందుకు పట్టుకోవడం లేదో అర్థం కావడం లేదని తెలిపారు. ఎందుకు కాలయాపన చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసును నీరుగార్చేలా పోలీసులు వ్యవహరిస్తున్న తీరు తమను పలు అనుమానాలకు గురి చేస్తోందని ఆరోపించారు. తమకు న్యాయం చేసేంత వరకు ఆందోళనలు, న్యాయ పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు, ఇతర ముస్లింలకు హామీ ఇచ్చినా వారు ససేమిరా అంటున్నారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై అటు గ్రామస్తులు, ముస్లిం సంఘాల నాయకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

కళాశాలల్లో ర్యాగింగ్‌కు చెక్ పెట్టాలి

- జిల్లా పోలీసులకు ఆదేశాలు జారీ చేసిన ఎస్పీ తుషార్ డూడీ
- యాంటీ ర్యాగింగ్ కమిటీలు సమర్థంగా వ్యవహరించాలి



పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎస్పీ

బాపట్ల టౌన్: ర్యాగింగ్ అనేది వికృత చేష్టని, దాన్ని ప్రారంభంలోనే తుంచి వేయాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితం అంధకారమేనని విద్యార్థులకు తెలియజేయాల్సిన బాధ్యత పోలీస్ అధికారులపై ఉందని చెప్పారు. జిల్లాలోని పోలీస్ అధికారులతో ఆదివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలోని విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిరోధానికి విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని చెప్పారు. విద్యాలయాలు అనేవి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దేలా ఉండాలని సూచించారు. విద్యార్థులు కూడా సీనియర్లు, జూనియర్లు అనే భేదాలు చూపకుండా సోదరభావనతో మెలగాలని తెలిపారు. విద్యార్థి దశలో ర్యాగింగ్‌కు పాల్పడి ఏదైనా కేసు నమోదైతే భవిష్యత్తు అంధకారంగా మారుతుందని హితవు పలికారు. నూతన చట్టాల ప్రకారం ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఒక్కసారి కేసు నమోదైతే విద్యార్థి జీవితం అంధకారంగా మారుతుందని తెలిపారు. ర్యాగింగ్ చేసినా, చేయడానికి సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామన్న విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలని సూచించారు. యాంటీ ర్యాగింగ్ కమిటీలు సమర్థంగా పనిచేసే విధంగా కళాశాల యాజమాన్యా లు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని స్పష్టం చేశా రు. సమస్యలు ఉంటే నేరుగా స్థానిక పోలీస్ అధికారులకు తెలపాలని చెప్పారు. స్థానిక పోలీస్ అధికారులు కూడా యాంటీ ర్యాగింగ్ కమిటీలో సభ్యులుగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు.

పోటాపోటీగా రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ వెల్లటూరు రోడ్డులో గల గుడ్‌షెపర్డ్ పాఠశాల ఆవరణలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు రెండో రోజుకు చేరుకున్నాయి. ఆదివారం నిర్వహించిన పోటీల్లో పురుషుల విభాగం నుంచి ఆరు జట్లు, మహిళా విభాగం నుంచి ఆరు జట్లు పోటీ పడగా, విజయనగరం, గుంటూరు, అనంతపురం, కర్నూలు జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయని ఉమ్మడి గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ నరసింహారెడ్డి తెలిపారు. అదేవిధంగా పురుషుల విభాగంలో శ్రీకాకుళం, కృష్ణా, విజయనగరం జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఇన్నారెడ్డి, పీడీలు చిరంజీవి, రాధాకృష్ణ, సురేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్ల సత్రంలో నూతన భవన సముదాయం



భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: కోటప్పకొండలోని శ్రీ యోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్, రెడ్ల సత్రంలో నూతన భవన సముదాయాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆదివారం ప్రారంభించారు. దాతల సహకారంతో దాదాపు రూ.80లక్షలతో నిర్మించిన 16గదులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ముందుగా రెడ్ల సత్రం ప్రాగణంలోని దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ రెడ్ల సత్రం అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని తెలిపారు. దాతల అందిస్తున్న విరాళాలను సద్వినియోగం చేస్తూ సత్రం కమిటీ పనిచేస్తుందన్నారు. రెడ్ల సత్రం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృత పరచాలని సూచించారు. నూతనంగా ప్రారంభించిన గదులను కోటప్పకొండ త్రికోటేశ్వరుణ్ణి దర్శించుకునేందుకు వచ్చే భక్తులు వినియోగించుకోవచ్చని తెలిపారు. సత్రం కమిటీ అధ్యక్షుడు కామిరెడ్డి నర్సిరెడ్డి, కార్యదర్శి చేగిరెడ్డి ఈశ్వరరెడ్డి, కోశాధికారి మేడం రామచౌదారెడ్డి, విప్పల దాణారెడ్డి, వేలూరి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..

రెడ్ల సత్రం జనరల్‌బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా భవనం రాఘవరెడ్డి, అధ్యక్షుడిగా కంజుల వీరారెడ్డి, కార్యదర్శిగా పొలిమేర వెంకటరెడ్డి, కోశాధికారిగా మాగులూరి సుబ్బారెడ్డి తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

7 పాయింట్లు సాధించిన గుంటూరు జట్టు



ఐదు వికెట్లు సాధించిన బౌలర్ ఎస్.అఖిల్

మంగళగిరి: ఏసీఏ సీనియర్ మెన్ డే ఇంటర్ డిస్ట్రిక్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లో గుంటూరు జట్టు ఏడు పాయింట్లు సాధించింది. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో ఉన్న ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. తొలి ఇన్నింగ్స్‌లో కృష్ణా జట్టు 48.3 ఓవర్లలో 195 పరుగులకు ఆలౌటైంది. గుంటూరు జట్టు 93.4 ఓవర్లలో 369 పరుగులు చేసి, ఆలౌటైంది. గుంటూరు జట్టు బ్యాట్స్‌మెన్ కె.పి. రాహుల్ 83, సూర్యవంశీ 55, బాబు 54 పరుగులు సాధించారు. కృష్ణా జట్టు బౌలర్లు రితేష్ బాబు, టి.శివకుమార్ చెరో మూడు వికెట్లు తీశారు. రెండో ఇన్నింగ్స్‌లో కృష్ణా జట్టు 43.5 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌటైంది. గుంటూరు జట్టు బౌలర్ ఎస్.అఖిల్ 5 వికెట్లతో రాణించాడు. గుంటూరు 7 పాయింట్లు సాధించింది.

అడ్మిన్ సెక్రటరీల పదోన్నతులకు వినతి

నెహ్రూనగర్: గ్రామ/వార్డు అడ్మిన్ సెక్రటరీలకు సీనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించాలని ఏపీ స్టేట్ వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఒ.రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థకు సంబంధించి తీసుకువచ్చిన రేషనలైజేషన్ విధానాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా అడ్మిన్ సెక్రటరీల సేవలను గుర్తించి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించాలని కోరారు.

ప్రకాశంపై అనంతపురం ఘనవిజయం

- 5 వికెట్లు సాధించిన హనీష్ వీరారెడ్డి
- నరసరావుపేటలో కొనసాగుతున్న అండర్–19 అంతర్ జిల్లాస్థాయి బాలుర క్రికెట్ పోటీలు



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్–19 బాలుర క్రికెట్ పోటీలలో ప్రకాశం జిల్లాపై అనంతపురం 41 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం తొలి ఇన్నింగ్స్‌లో 324 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ దిగిన ప్రకాశం జట్టు 284 పరుగులకు ఆలౌట్ అయింది. రెండవ ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన అనంతపురం శనివారం నాటి 4 వికెట్ల నష్టానికి 65 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆదివారం బ్యాటింగ్ ప్రారంభించి 172 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని కె.వెంకట్ లోకేష్ 56 పరుగులు సాధించాడు. ప్రకాశం బౌలర్లు ఆర్.గిరీష్, ఎస్.అఖిల్‌కు చెరో మూడు వికెట్లు లభించాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 171 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని కె.ఆనంద్ 38, కె.అక్షయ్ 38 పరుగులు సాధించారు. తొలి ఇన్నింగ్స్‌లో 4వికెట్లతో రాణించిన అనంతపురం బౌలర్ హనీష్ వీరారెడ్డి రెండవ ఇన్నింగ్స్‌లోనూ 5 వికెట్లు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. విజయం సాధించిన అనంతపురం జట్టుకు ఆరు పాయింట్లు లభించాయి. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

అమరావతి మేజర్‌పై తప్పిన పెను ప్రమాదం

- ఎరువుల లోడుతో వెళ్తున్న లారీ చక్రాలు ఊడిన వైనం
- వంతెనపై హఠాత్తుగా ఆగిన లారీ
- రెండు కిలోమీటర్ల మేర నిలిచిన ట్రాఫిక్



చక్రాలు ఊడిన లారీ నుంచి మరో లారీలోకి ఎరువుల బస్తాలను లోడ్ చేస్తున్న కార్మికులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని అమరావతి మేజర్ కాలువ వంతెనపై ఆదివారం పెను ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి.. తాడేపల్లి గూడెం నుంచి క్రోసూరుకు సూపర్ ఎరువుల బస్తాల లోడుతో వెళుతున్న లారీ సత్తెనపల్లి అమరావతి మేజర్ కాలువ వంతెన పైకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో వంతెనకు ఉన్న గ్రిల్స్ పట్టుకుపోవడంతో లోడు తో ఉన్న లారీ ఒక్కసారిగా నిలిచి పోయింది. హఠాత్తుగా లారీ ఆగడంతో లారీ చక్రాలు సైతం ఊడిపోయాయి. డ్రైవర్ కొంత చాకచక్యంగా వ్యవహరించి లారీని అదుపు చేయడంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. జాతీయ రహదారిపై లోడ్ లారీ ఆగిపోవడంతో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోయి ట్రాఫిక్ స్తంభించింది. లోడు లారీలోని ఎరువుల బస్తాలను మరో లారీలోకి లోడ్ చేయించి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించేందుకు పట్టణ పోలీసులు కృషి చేశారు. సుమారు 2–3 గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. ఈ క్రమంలో గుంటూరు వైపు వెళ్లే వాహనదారులు నరసరావుపేట మీదుగా గుంటూరు వెళ్లేందుకు వెనక్కి మలుపుకొని పయనమయ్యారు.

ఓగేరు వాగులో పడి వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: వాగులో దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట మండలం రాజాపేటకు చెందిన దార్ల వెంకటేశ్వర్లు (36) కుటుంబం ఉపాధి నిమిత్తం గుంటూరు వెళ్లారు. ఇటీవల వెంకటేశ్వర్లు స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో అతని బాబాయికి చెందిన గేదెల్ని మేపేందుకు శనివారం సాయంత్రం పొలానికి తోలుకెళ్లాడు. గ్రామానికి సమీపానే ఉన్న ఓగేరు వాగులో గేదెలు దిగడంతో వాటిని బయటకు తెచ్చేందుకు వెంకటేశ్వర్లు వాగులోకి దిగాడు. లోతు, నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. దూరంగా ఉండి గమనించి ఓ వ్యక్తి గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో వాగులోకి దిగి కాపాడే ప్రయత్నం చేశారు. అప్పటికే వెంకటేశ్వర్లు మృతి చెందాడు. మృతదేహాన్ని రూరల్ పోలీసులు చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

చేతిలో యాప్.. కష్టాలకు ఫుల్‌స్టాప్!

- ప్రయాణికుల సేవలో 'రైల్ మదద్'
- 35 రకాల ఫిర్యాదులకు అవకాశం
- సిబ్బంది తక్షణ స్పందనకు చర్యలు
- జవాబుదారీతనం పెంచేలా ఏర్పాట్లు



రైలు ఎక్కడానికి ఫ్లాట్ ఫాంపై వేచి ఉన్న ప్రయాణికులు



గుంటూరు రైల్వే స్టేషన్

లక్ష్మీపురం: రైలు ప్రయాణమంటేనే ఎక్కువ సార్లు నరకయాతన అన్నట్లు ఉంటుంది. సమస్యలు ఎదురైనప్పుడు ఎవరికి ఫిర్యాదు చేయాలో కూడా తెలియదు. అందుబాటులో ఉన్న కిందిస్థాయి సిబ్బందికి చెప్పినా స్పందన అంతంత మాత్రంగానే ఉంటుందనే ఆరోపణలు సరేసరి. ఈ నేపథ్యంలోనే సౌత్ సెంట్రల్ రైల్వే ప్రత్యేకంగా ఓ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనిలో ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండటంతో సమస్యలకు సత్వర పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంది. ప్రయాణికులకు అధికారులు, సిబ్బంది మరింత జవాబుదారీగా వ్యవహరించేందుకు రైల్వే శాఖ ఇప్పటికే ఎన్నో వినూత్న కార్యక్రమాలను చేపడుతోంది. ప్రయాణికుల భద్రత, వివిధ రకాల సేవల నిమిత్తం టోల్ ఫ్రీ నంబర్లను ప్రకటించింది. తర్వాత నేరుగా ఫిర్యాదు చేసేందుకు రైల్ మదద్ పోర్టల్, యాప్‌లను తీసుకొచ్చింది. యాప్ ద్వారా ప్రయాణికులు 35 రకాల ఫిర్యాదులు చేసేందుకు అవకాశం కల్పించింది. సమస్యకు సంబంధించిన ఫొటోలను కూడా నేరుగా అప్‌లోడ్ చేయొచ్చు. తద్వారా ప్రయాణికులకు సౌకర్యం, భద్రతతోపాటు సిబ్బంది కూడా విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించే పరిస్థితి ఉంటోంది. ఫిర్యాదు చేయాలంటే విధిగా టికెట్ తీసుకుని ఉండాలి. రైలు బయట ఉంటే ఉంటే ప్లాట్ ఫాం టికెట్ ఉన్నప్పుడే యాప్ ద్వారా ఫిర్యాదుకు అవకాశం ఉంది. యాప్‌లో టికెట్ వివరాలు కూడా నమోదు చేయాల్సి ఉంటుంది.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ఈ ఫిర్యాదులపై రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం), డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) పర్యవేక్షణ ఉంటుంది. ఫిర్యాదు స్థాయిని బట్టి సంబంధిత విభాగానికి చెందిన ముఖ్య అధికారికి సమాచారం పంపుతారు. దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా వారిని ఆదేశిస్తారు. తీసుకున్న చర్యలు, స్పందనను ఫిర్యాదుదారుడికి మెసేజ్ రూపంలో పంపించాల్సి ఉంటుంది. యాప్ ద్వారా అందిన ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కరించారో ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో వీరు సమర్పించాలి.

ఎలాంటి ఫిర్యాదులు చేయొచ్చంటే..

వైద్యసహాయం, భద్రతాలోపం, వేధింపులు, చోరీలు, దివ్యాంగులకు వసతుల లేమి, ప్రత్యేక అవసరాలు కలిగిన మహిళలకు సౌకర్యాల కొరత, రిజర్వ్ చేయని టిక్కెట్లు, రిజర్వేషన్ వివరాలు, సామగ్రి మరిచిపోవడం, చోరీకి గురవడం, టిక్కెట్ల డబ్బు వాపసు, సిబ్బంది ప్రవర్తనా లోపం, రైలులో పరిశుభ్రత లోపించడం, క్యాటరింగ్ సమస్యలు, ఆహార సరఫరాలో ఇబ్బందులు, నీటి వసతి లేకపోవడం, సిబ్బంది అవినీతికి పాల్పడటం, లంచం తీసుకోవడం, అధిక ధరల వసూలు వంటి అంశాలపై ఫిర్యాదుకు అవకాశం కల్పించారు. ప్రయాణ సమయంలో తక్షణ సహాయం అందుకోవచ్చు. ట్రైన్ ఆలస్యం, రద్దు గురించి సమాచారం పొందొచ్చు. యాప్ ద్వారా టికెట్ కూడా రద్దు చేయవచ్చు. భోజన సేవల వివరాలు, వాటి ధరలు పరిశీలించవచ్చు. రైల్వే స్టేషన్ల గురించి సమాచారం పొందొచ్చు. ప్లాట్‌ఫాం మార్పులు, కస్టమర్ సర్వీసు వివరాలు తెలుసుకోవచ్చు. సాంకేతిక సమస్యల నివారణ కోసం సహాయం తీసుకోవచ్చు. సహాయ కేంద్రాలకు సులభంగా చేరుకునే మార్గాలు పొందొచ్చు. లైవ్ చాట్ ద్వారా సాయం కోరవచ్చు. ట్రైన్ రూట్, రాకపోకల సమయం తెలుసుకోవచ్చు. ఫిర్యాదుల పరిష్కారానికి వివరాలు ట్రాక్ చేయవచ్చు.

ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలంటే..

ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌లో ప్లేస్టోర్‌లోకి వెళ్లి రైల్ మదద్ అని టైప్ చేసి యాప్ డౌన్‌లోడ్ చేయాలి. అందులో అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి నిబంధనలు అంగీకరించిన తర్వాత ఉపయోగించుకోవచ్చు. యాప్ తెరవగానే పేరు నమోదు చేసి, తర్వాత ఫోన్ నంబర్ ఇవ్వాలి. ఫోనుకు ఓటీపీ (వన్ టైం పాస్‌వర్డ్) వస్తుంది. దాని ఆధారంగా యాప్‌లో ప్రయాణించే రైలు, ఫిర్యాదు వివరాలు, ఫొటోలు అప్‌లోడ్ చేయాలి.



రైల్ మదద్ యాప్

ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరం



రైల్ మదద్ యాప్‌ను సౌత్ సెంట్రల్ రైల్వే ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టింది. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు వారికి మరింత సౌకర్యవంతంగా ఉండేలా దీన్ని రూపొందించారు. యాప్ ద్వారా ప్రతి నెల డివిజన్ పరిధిలో సుమారు 150–250 వరకు ఫిర్యాదులు వస్తుంటాయి. టికెట్ రిజర్వేషన్ సమస్య, పారిశుద్ధ్యలోపం వంటి వాటిపై ఎక్కువగా ఫిర్యాదులు చేస్తుంటారు. వెంటనే పరిశీలించి సంబంధిత అధికారులకు, సిబ్బందికి నోటీసుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తుంటాం. ప్రయాణ సమయంలో ఇబ్బందులను నేరుగా ఉన్నతాధికారులకు తెలిపే అవకాశం ఈ యాప్‌లో ఉంది.

– ఎం.రామకృష్ణ, డీఆర్ఎం, గుంటూరు రైల్వే డివిజన్